

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం:సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బేతు చక్రధర్ (పశ్చిమగోదావరి జిల్లా) గురువారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పుడెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

డ్రగ్స్ అధికారుల దాడులు



జిల్లాలో ఔషధ నియంత్రణ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఏపీ డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కె.రఘురామ్‌రెడ్డి సూచనల మేరకు దాడులు చేపట్టారు.

8లో

న్యూస్‌రీల్

కన్నబాబుకు గజమాలతో సత్కారం



కురసాల కన్నబాబును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మూడోసారి పగ్గాలు చేపట్టిన మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయులు అభినందనలు తెలిపారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో కన్నబాబును వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార రాజా, పిఠాపురం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జవ్వాది కృష్ణమాధవ రావు, మార్నీడి రంగబాబు, తదితరులు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలియజేశారు. కొవ్వాడ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ కె.సుధీర్, రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు సన్నీ, కండిల రవి, వీరన్న తదతరులు గజ మాలతో కన్నబాబును సత్కరించారు. అలాగే వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పులగం రామకృష్ణారెడ్డి తదితరులు కన్నబాబుకు అభినందనలు తెలిపారు.

4న ఉపసర్పంచ్ ఎన్నికలు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో ఖాళీగా ఉన్న ఏడు గ్రామ పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాపంచాయతీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టు 19న జిల్లాలో ఖాళీఅయిన వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించిన నేపథ్యంలో ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. పెదపూడి మండలం కాండ్రేగుల, పెద్దాపురం మండలం గోరింట, రౌతులపూడి మండలం ఏ మల్లవరం, తాళ్లరేవు మండలం తాళ్లరేవు, తాళ్లరేవు మండలం లచ్చిపాలెం, తాళ్లరేవు మండలం ఇంజరం, తొండంగి మండలం వేమవరం గ్రామాల్ల 4న ఉదయం 11 గంటలకు ఆయా ఉపసర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్ తెలిపారు.

ఐపీసీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

రెండు విడతల్లో 36 మందికి అడ్మిషన్లు



విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే, స్వీడన్ బీటీహెచ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కొలాబరేటివ్ (ఐపీసీ) కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి విడతలో సీఎస్ఈ 15, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్)లో ఇద్దరికి ప్రవేశాలు కల్పించగా గురువారం రెండవ విడతలో సీఎస్ఈలో ఐదుగురు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మెషిన్ లెర్నింగ్‌లో 12 మందికి, ఎన్ఆర్ఐ కోటాలో సీఎస్ఈలో ఇద్దరికి అడ్మిషన్లు కల్పించారు. విద్యార్థులకు వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అడ్మిషన్లు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ఫారన్ వర్సిటీ డైరెక్టర్ శివనాగరాజు, అడ్మిషన్ డైరెక్టర్ ఎంఎం ప్రసాద్ పాల్గొన్నారు.

గౌతమ్ మృతి క్రీడా రంగానికి లోటు

చీఫ్ కోచ్ శ్రీనివాస్‌కుమార్



గౌతమ్ (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్: వర్ధమాన అథ్లెట్ పోతుల గౌతమ్ మృతి జిల్లా క్రీడారంగానికి తీరని లోటని డీఎస్ఏ చీఫ్ కోచ్ బి.శ్రీనివాస్‌కుమార్ గురువారం తెలిపారు. మూడు రోజుల క్రితం తుని వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గౌతమ్ తీవ్రంగా గాయపడగా ఆయనను స్థానిక అపోలో ఆస్పత్రిలో చేర్చారు. మూడు రోజులుగా మృత్యువుతో పోరాడి బ్రెయిన్ డామేజ్‌తో అతడు మృతి చెందినట్టు వైద్యులు మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రకటించారు. గౌతమ్ భౌతిక కాయానికి పలువురు కోచ్‌లు, క్రీడాకారులు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కోచ్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ 36 రాష్ట్ర, 16 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అథ్లెటిక్స్‌లో అనేక పతకాలను గౌతమ్ సాధించాడన్నారు. గౌతమ్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.







ఆయన కళాసృష్టి బొమ్మాండం

- కళకు గుండుసూదే ఆ'ధారం'
- అద్భుత కళారూపాలు ఆవిష్కరణ
- రాజశేఖరరెడ్డి కళా ప్రతిభ



పిఠాపురం: చిన్న సుత్తి ..రంగు రంగుల దారాలు.. గుండు సూదులు ఆయన చేతికి దొరికాయంటే చాలు. ఎన్నో అద్భుత కళా కండాలు చేతిలో రూపుదిద్దుకుంటాయి. సరదాగా నేర్చుకుని ప్రారంభించిన కళ ఎన్నో చిత్రాలకు ప్రాణం పోస్తోంది. పత్రికలలో వచ్చిన నీడిల్ త్రెడ్ బొమ్మల తయారీని చూసి వాటికి భిన్నంగా ఆలోచించారు. అనుకున్నదే తడవుగా అడుగేశారు. తక్కువ కాలంలోనే విభిన్న ఆకృతులను తయారు చేశారు. స్వతహాగా ఫోటోగ్రాఫర్ కావడంతో ఆకర్షణీయమైన ఫోటోలు తీయడం వల్ల వాటిలాగే దారంతో గుండుసూదులు ఉపయోగించి బొమ్మలు తయారు చేయడం ప్రారంభించారు. వినాయకుడు, ఆంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి, కృష్ణుడు, కృష్ణార్జునులు, తదితర బొమ్మలు తయారు చేశారు. ఇప్పటి వరకు తయారు చేసిన వాటిని భద్రపర్చడంతో పాటు కొన్నిటిని స్నేహితులకు ప్రముఖులకు బహుమతులుగా ఇస్తున్నారు. ఖాళీ సమయాన్ని ఇలా కళాకృతుల తయారీకి వినియోగిస్తున్నారు. అద్భుతాలు ఆవిష్కరిస్తున్నారు. ఆయనే కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన అబ్బిరెడ్డి రాజశేఖరరెడ్డి.


ఎగ్జిబిషన్ పెట్టాలని కృషి చేస్తున్నా.

తన కళ గురించి రాజశేఖరరెడ్డి ఏమంటారంటే..1992లో ఒక పత్రికలో వచ్చిన కథనం చూశాను. వాటికి భిన్నంగా తయారు చేయాలని సంకల్పించాను. మొదట్లో చాలా కష్ట పడాల్సి వచ్చేది. రానురానూ అలవాటు పడ్డాను. ఇప్పుడు సునాయాసంగా తయారు చేస్తున్నాను. అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు దుర్యోధనుడి బొమ్మ తయారు చేసి తీసుకెళ్లి పుట్టినరోజు సందర్భంగా బహుమతిగా ఇచ్చాను. ఆయన ఎంతో గొప్పగా మెచ్చుకున్నారు. ఇప్పటి వరకు వంద వరకు బొమ్మలు తయారు చేశాను. ఒక బొమ్మ తయారీకి రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు అవుతుంది. మూడు అడుగుల నుంచి పది అడుగుల వరకు పొడవున్న బొమ్మలు తయారు చేశాను. ఒక్కో బొమ్మ తయారీకి వారం రోజులు నుంచి నెల రోజులు పడుతోంది. త్వరలో ఎక్కువ బొమ్మలు తయారు చేసి ఎగ్జిబిషన్ పెట్టాలని ఆలోచనలో ఉన్నాను. బొమ్మల తయారీకి నైలాన్ దారం వాడుతుంటాను. చమ్కీలు దారాలు ప్లేడ్ ముకమల్ క్లాత్ ఫ్రేమ్‌లు కట్టిస్తుంటాను. దాని వల్ల బొమ్మలు ఎప్పటికి పాడవకుండా ఉంటాయి. ప్రస్తుతం బొమ్మల తయారీపై దృష్టి పెట్టానని రాజశేఖరరెడ్డి సాక్షికి వివరించారు.



దారం, గుండుసూదులతో బొమ్మలు తయారు చేస్తున్న రాజశేఖరరెడ్డి





రాజశేఖరరెడ్డి చేతిలో రూపుదిద్దుకున్న నీడిల్ త్రెడ్ బొమ్మలు

పునాది అభ్యసన మరింత బలపరచాలి

డైట్ ప్రిన్సిపాల్ రమణ



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణ

సామర్లకోట: ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలుగు, గణితంలో పునాది అభ్యసన స్థాయి బలంగా ఉన్నప్పుడు ఆ విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించుకోగలుగుతాడని బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ అన్నారు. స్థానిక వైటీసీలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి కోర్సు డైరెక్టరుగా వ్యవహరించిన శిక్షణ శిబిరంలో అనకాపల్లి, కాకినాడ జిల్లాల రిసోర్సు పర్సన్లకు జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు మారుతున్న కాలాన్ని, పరిస్థితుల కనుగుణంగా బోధన అభ్యసన పద్ధతులను మెరుగు పరచుకోవాలన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు తెలుగులో చదవడం రాయడం గణితంలో చతుర్విధ ప్రక్రియలను పూర్తి స్థాయిలో సామర్థ్యాలను సాధించేందుకు అనుగుణంగా డీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 2026 నాటికి పునాది స్థాయి అభ్యసనా లక్షాలు సాధించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. రిసోర్సుపర్సన్లుగా కె.ఉమామహేశ్వరరావు, సీహెచ్ దొర, నానాజీ, ప్రవీణ్, కొండలరావు, రాంబాబు, చంద్రసూర్యం తదితరులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏఎంఓ పి.రాంబాబు కోర్సు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. మండపేట, గండేపల్లి, ప్రతిపాడు ఎంఈఓలు సీహెచ్ సోమిరెడ్డి, కె.వెంకటరెడ్డి, వై.అచ్చిరాజు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

సీఎంకు ఎంపీ గీత వినతి

కాకినాడ: పెద్దాపురం మండలం కాండ్రకోట బెడ్ రెగ్యులేటర్, అప్పన్నపాలెం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ వంగా గీత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లాకు వచ్చిన సీఎంను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాండ్రకోటలో ఏలేరు కాలువపై ఉన్న పురాతన వంతెన కూలిపోవడంతో బెడ్‌రెగ్యులరేటర్ పూర్తిగా కొట్టుకు పోయిందన్నారు. బ్రిడ్జి లేకపోవడంతో పొలం పనులకు వెళ్ళే రైతులు, కూలీలకు, పాడి పశువులకు ఇబ్బందిగా ఉందన్నారు. పంటనీరు వృధాగా పోతుందని, గట్టుకోతకు గురై ప్రమాదపరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఏలేశ్వరం వద్ద అప్పనపాలెం బ్రిడ్జి కూడా కూలిపోయి ప్రమాదకరంగా ఉందన్నారు. , ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. వీటికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హౌసింగ్‌కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ కూడా ఆమెతో కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు.



సమస్యలను సీఎం జగన్‌కు వివరిస్తున్న ఎంపీ వంగా గీత

మాతృ మరణాలపై సమీక్ష

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం సాయంత్రం మాతృ మరణాలపై జిల్లా సబ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఐవో డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మాతృ మరణాల నియంత్రణకు సబ్ కమిటీ సభ్యులు కీలక సూచనలిచ్చారు. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి మొత్తం నాలుగు మాతృ మరణాలపై ఆడిట్ నిర్వహించామని అరుణ తెలిపారు. డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో సబ్ కమిటీ సభ్యులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ జయధీర్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ హరిబాబు సహా ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్
- 50 పడకల ఆసుపత్రి ప్రారంభం

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించారని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో నాడు-నేడులో భాగంగా నాబార్డు నిధులు రూ.3 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను గురువారం వారు ప్రారంభించారు. 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా స్థాయిని పెంచారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో పెనుమార్పులు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వాసుపత్రుల్లో కరోనా వంటి అనేక రోగాలకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో నియోజకవర్గంలోని రౌతులపూడి, ఏలేశ్వరం మండలాల్లో నూతన పీహెచ్‌సీలు ఏర్పాటు చేశారన్నారు. ఏలేశ్వరం మండలం యర్రవరంలో త్వరలో మరో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేశామన్నారు. తొలుత మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. పేదలకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకు ఇవ్వడమే ఆహా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య సమన్వయ అధికారి విష్ణువర్ధిని, నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైస్ చైర్‌పర్సన్లు శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, జువ్విన వీర్రాజు, జువ్విన వీరరాఘవమ్మ, బదిరెడ్డి గోవిందు, నీరుకొండ సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో 50 పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ వంగాగీత, ఎమ్మెల్యే పర్వతప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగాగీత

నేడు 'రైతు భరోసా' జమ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ఏటా వారి ఖాతాల్లో రూ.7500 జమ చేస్తోంది. జిల్లాలోని కౌలు రైతులకు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నిధులు జమ చేయనున్నారు. జిల్లాలోని 11,534 మంది రైతులకు రూ.8.65 కోట్లు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లాలోని కలెక్టరేట్ వివేకానందహాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు.

శ్రీవారికి తలనీలాల వేలం ద్వారా రూ. 9.70 కోట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారికి భక్తులు సమర్పించే తలనీలాలకు రెండేళ్ల కాల పరిమితితో (2023 నవంబర్ 13 నుంచి 2025 నవంబర్ 12 వరకు) ఆలయ అధికారులు గురువారం వేలాన్ని నిర్వహించారు. ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్(తణుకు), గరుడ ఎంటర్‌ప్రైజెస్(తిరుపతి), శ్రీనివాసా హెయిర్ ఇండస్ట్రీస్(ఏలూరు), కేవీ ఎంటర్‌ప్రైజెస్(ప్రొద్దుటూరు) సంస్థలు పాల్గొన్నాయి. కేవీ ఎంటర్‌ప్రైజెస్ ఏడాదికి రూ.9.70 కోట్లకు హెచ్చు పాటదారునిగా నిలిచింది. గతేడాది స్వామివారికి తలనీలాల ద్వారా రూ.7,37,15,400 ఆదాయం లభించింది. ఈసారి రూ. 2,32,84,600 ఆదాయం పెరిగిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నిర్వహించారు. వేలంలో హెచ్చు పాటదారు దంపతులను ఈఓ త సత్కరించారు.

శరవేగంగా.. సుందరంగా..

- లోవ దేవస్థానంలో చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు
- దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.రెండు కోట్లు మంజూరు
- తొలిసారిగా నిధులు మంజూరు చేసిన దేవదాయశాఖ



నాలుగు అంతస్తులు పూర్తయిన మహామండపం పనులు

తుని రూరల్: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. కృష్ణశిలతో అమ్మవారి ప్రధానాలయం, ఐదు అంతస్తుల మహా మండపం, తొమ్మిది అంతస్తుల మహా రాజగోపురం, రెండో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఎస్కలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

మంత్రుల కృషితో...

ఇటీవల దేవస్థానానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను ఆలయ ఈఓ, ధర్మకర్తలు దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించిన మంత్రి దాడిశెట్టి రాజా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణను కలసి నిధులు మంజూరుకు కృషి చేసినట్టు ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దీంతో దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం సీజీఎఫ్ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు ఈఓ తెలిపారు. ఈ నిధులతో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు మంజూరు చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కావడం విశేషం. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రులు దాడిశెట్టి రాజా, కొట్టు సత్యనారాయణలకు ఈఓ, ధర్మకర్తలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనవరికి పనులు పూర్తి

రూ.10 కోట్లతో చేపట్టిన లోవదేవస్థానం అభివృద్ధి పనులు నవంబర్ నాటికి పూర్తికావలసి ఉండగా అమ్మవారి ప్రధానాలయానికి అవసరమైన కృష్ణశిలలు కొండపైకి తరలించడం కష్టమవుతోంది. ఇందుకోసం ప్రత్యేక క్రెన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పటికప్పుడు అవసరమైనన్ని కృష్ణశిలలను తరలిస్తూ ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఐదంతస్తుల మహామండపం పనుల్లో ఇప్పటికే 70 శాతానికిపైగా పూర్తయ్యాయి. రెండో ఘాట్ రోడ్డుకు గ్రావెల్ పనులు పూర్తవడంతో వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఘాట్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. భక్తుల సౌకర్యార్థం ఎస్కలేటర్లను అమర్చనున్నారు. ఐదు అంతస్తుల మహామండపం పనులు పూర్తయిన తర్వాత తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మించాల్సి ఉందని ఈఓ తెలిపారు. ఈ పనులన్నీ 2024 జనవరికి పూర్తి చేసి నూతన ఆలయాన్ని ప్రారంభిస్తామని, ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలకు అనుమతిస్తామని వివరించారు.



కృష్ణశిలతో నిర్మిస్తున్న తలుపులమ్మతల్లి నూతన ఆలయం

చిన్నారుల చదువుకు మెరుగులు

- 1,2 తరగతుల్లో అభ్యసనానికి ఎఫ్ఎల్ఎన్
- ప్రథమ్ సంస్థ భాగస్వామ్యంతో కార్యక్రమం అమలుకు శ్రీకారం
- జిల్లాల్లో డీఆర్పీలకు కొనసాగుతున్న శిక్షణ


శిక్షణలో భాగంగా కృత్యాలు ప్రదర్శిస్తున్న డీఆర్పీలు

రాయవరం: ఒక భవనం నిర్మాణం చేసేటప్పుడు పునాది బలంగా ఉండే విధంగా చూస్తారు. పునాది బలంగా ఉంటే భవనంపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యార్థికి వర్తిస్తుంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటే ఆ విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను సులభంగా పెంచుకుంటాడు. అందుకే ఇప్పుడు ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని చేపట్టింది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్)లో భాగంగా ఎన్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.

ఈసీసీఈలో భాగంగా..

నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ-1లో 3-4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ-2లో 4-5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1,2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాల్సి ఉంటుంది.

ఎఫ్ఎల్ఎన్ ఎందుకంటే

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పొందాల్సి ఉంటుంది. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులు తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు ఉండడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యుమరసీ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థి 1,2 తరగతులు పూర్తి చేసి మూడవ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలను సాధించాల్సి ఉంటుంది.

జ్ఞాన జ్యోతి, జ్ఞాన ప్రకాష్‌గా..

ఎఫ్ఎల్ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్యను జ్ఞాన ప్రకాష్‌గా పేర్కొన్నారు. తొలుతగా ప్రాథమిక విద్యను బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు తర్ఫీదు ఇస్తున్నారు. మండలానికి ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులను డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి రెసిడెన్షియల్ మోడ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి జిల్లాలో మండలానికి ముగ్గురు ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. కోనసీమ జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలకు శిక్షణనిస్తున్నారు. కోనసీమ జిల్లాకు చెందిన డీఆర్పీలు సామర్లకోట యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో ఈ నెల 28 నుంచి శిక్షణ పొందుతున్నారు. అనంతరం జ్ఞాన జ్యోతి డీఆర్పీలుగా ఎంపిక చేసిన వారికి కూడా తొమ్మిది రోజుల రెసిడెన్షియల్ ట్రెనింగ్ అందజేస్తారు. త్వరలో జ్ఞానజ్యోతి డీఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు.

విజయవంతంగా శిక్షణ



ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో ఎంపికయిన డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్(డీఆర్పీ)లకు మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నాం. మొదటి విడతలో సామర్లకోట వైటీసీలో కోనసీమ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. రెండవ విడతలో కాకినాడ జిల్లాకు చెందిన డీఆర్పీలకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పొందిన డీఆర్పీలు త్వరలో ఆయా జిల్లాల్లో 1,2 తరగతులు బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

మహిళ దుర్మరణం


ప్రమాదానికి గురైన కారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పోలవరం కాలువ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి 16లో గురువారం తెల్లవారుజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఒక వ్యక్తికి గాయాలైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా రవ్వవరం మండలం ముప్పరాజువారిపాలెంకు చెందిన ఆరుగురు ఒక కారుపై కోటనందూరు మండలం కేఈ చిన్నయపాలెం వెళుతున్నారు. గురువారం తెల్లవారుజామున జాతీయ రహదారి 16లో గొల్లప్రోలు మండలం చెందుర్తి పోలవరం కాలువ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి డ్రైవరుకు నిద్ర రావడంతో కారు డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న గుంటూరు జిల్లా రవ్వవరం మండలం ముప్పరాజువారిపాలెంకు చెందిన సంతపురం గురువర్ధన 30 అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయాలైన వారిని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

డ్రగ్స్ అధికారుల దాడులు

- రూ.10 లక్షల విలువైన ఔషధాలు పట్టివేత
- 136 రకాల మందులు సీజ్


లైసెన్సు లేకుండా విక్రయిస్తున్న మందులను పట్టుకున్న డ్రగ్స్ ఏడీ నాగమణి, అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఔషధ నియంత్రణ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఏపీ డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కె.రఘురామ్‌రెడ్డి సూచనల మేరకు దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న అనుమానిత మందుల దుకాణాలు, అనధికార మందుల విక్రేతలు, ఫిజీషియన్ శాంపిల్స్ అమ్మకాలపై మూడు జిల్లాల ఔషధ నియంత్రశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.నాగమణి దృష్టి సారించారు. జిల్లా శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ దిశగా దాడులు నిర్వహించగా రాజమహేంద్రవరం నాళం భీమరాజు వీధిలో ఒక ఇంటిలో డ్రగ్స్ లైసెన్సు లేకుండా మందులు విక్రయిస్తున్న చెక్కా శ్రీనివాసరావును పట్టుకున్నారు. ముందుగా అధికారులు శ్రీనివాసరావు అమ్మకాలు సాగిస్తున్న ప్రాంతంపై దాడి చేశారు. అతని వద్ద జనరల్ మందులు, ఫిజీషియన్ శాంపిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద 62 రకాల మందులు, సుమారు రూ.5 లక్షలు విలువైన మందులు స్వాధీనం చేసుకున్నారు. తాడితోట రామాలయంలోని ఒక ఇంటిలో మత్తు మందులు, ఫిజీషియన్స్ శాంపిల్స్‌ను డ్రగ్స్ అధికారులు పట్టుకున్నారు. ఆ ఇంటిపై ముందుగా నిఘాపెట్టిన అధికారులు అకస్మాత్తుగా దాడి చేశారు. ప్రగళ్లపాటి శ్రీనివాసరావు అనే మెడికల్ రిప్రజెంటేటివ్‌ను పట్టుకున్నారు. అతని వద్ద మత్తు మందులతో పాటు ఫిజీషియన్ శాంపిల్స్ మొత్తం 74 రకాల మందులను స్వాధీనం చేసుకున్నారు. మందులను సీజ్ చేసి ఏజేఎఫ్‌సీం కోర్టుకు అప్పగించారు. నిందితులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీ నాగమణి మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ జిల్లాల్లోని మందుల విక్రయ దుకాణాలపై నిరంతర దాడులు కొనసాగుతాయని, ఎవరైనా అనధికారంగా, చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ దాడుల్లో రాజమహేంద్రవరం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కొవ్వూరు డీఐ ఎం.జయలక్ష్మి, కాకినాడ రూరల్ డీఐ ఎం.మురళీ, అమలాపురం డీఐ కేవీ భూపేష్ పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు


పాదగయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు


పాదగయలో వ్రతాలకు పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్న భక్తులు

- పాదగయ క్షేత్రంలో వ్రతాలు ఆచరించనున్న ఐదు వేల మంది
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు సొంత నిధులు రూ.25 లక్షలతో ఏర్పాట్లు

పిఠాపురం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు ఐదు వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందరూ పూజ చేసుకునేలా ఏర్పాట్లు చేసినట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయంలో గురువారం పూజా సామగ్రిని సిద్ధం చేశారు. పూజలకు వచ్చే భక్తులకు ఎండ తగలకుండా లైన్లతో పాటు షామియానాలు ఏర్పాటు చేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐదు దఫాలుగా పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో టోకెన్లు తీసుకోవడానికి భారీగా మహిళలు తరలిరావడంతో గురువారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. భక్తులకు ప్రసాదం, మంచినీటి వసతి కల్పిస్తున్నామని, మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తెలిపారు. టోకెన్ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఆ టోకెన్‌పై సూచించిన సమయానికి అరగంట ముందుగా ఆలయానికి రావాలన్నారు. భక్తులకు పూజా సామగ్రి ఆలయంలో అందజేస్తారని ఆయన తెలిపారు. వ్రతాలు ఆచరించే భక్తులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తన సొంత నిధులు రూ.25 లక్షలతో చీరలు, రవికలు పూజా సామగ్రి ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.


రత్నగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించే కల్యాణ మంటపం

రత్నగిరిపై ఏర్పాట్లు పూర్తి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రామాలయం వద్ద గల స్వామివారి వార్షిక కల్యాణ మంటపంలో వ్రతాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు ఆరు వేల మంది మహిళలు వ్రతమాచరిస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. వ్రతమాచరించే మహిళలు రెండు కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, పూలు తెచ్చుకోవాలి. మిగిలిన పూజాద్రవ్యాలన్నీ దేవస్థానమే సమకూర్చుతుంది. వ్రతాలు ఆచరించే మహిళలకు లక్ష్మీదేవి రూపు, తోరం, ప్రసాదం అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనం, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కల్పిస్తామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. వార్షిక కల్యాణ మంటపాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు

నిడదవోలు : గుర్తు తెలియని రైలు ఢీకొని నిడదవోలు – చాగల్లు రైల్వేస్టేషన్ల మధ్య డౌన్ లైన్ ట్రాక్‌పై గురువారం సుమారు 40 – 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపిన వివరాల ప్రకారం మృతుని నిక్కరు జేబులో ఈ నెల 28న మద్రాస్ రైల్వే స్టేషన్లో తీసుకున్న ఫ్లాట్ ఫాం టిక్కెట్, ఈ నెల 29న ఉదయం మద్రాస్– శాలిమార్‌కు తీసుకున్న ట్రైన్ టికెట్లు ఉన్నాయి. మృతుడు ఎరుపు, నలుపు తెలుపు నిలువుచారల కురచ చేతుల చొక్కా, సిమెంట్ కలర్ నిక్కరు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీహరిబాబు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94906 17090, 70133 60296 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కరప: గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు తెలిపిన కథనం మేరకు కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన మారెళ్ల కొండ తన భార్య వెంకటలక్ష్మి(45) దంత సమస్యలతో బాధపడుతుండటంతో వైద్యం చేయించడానికి కాకినాడ తీసుకెళ్లారు. పనిముగించుకుని మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా పెనుగుదురు, కరప గ్రామాల మధ్య కొరుపల్లి వెళ్లే జంక్షన్ వద్ద ఎదురుగా వెళుతున్న మోటార్ సైకిల్ సడన్‌గా కుడివైపునకు తిప్పాడు. దీంతో కొండ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకన కూర్చున్న భార్య వెంకటలక్ష్మి అదుపుతప్పి కిందకు పడిపోయింది. అదే సమయంలో కాకినాడ వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పెంకే సత్తిబాబు స్పందించి అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించడంతో 108 సిబ్బంది వచ్చి, వెంకటలక్ష్మిని పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించి వెళ్లిపోయారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని కరప పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ చెస్ పోటీలలో విద్యార్థి ప్రతిభ


సాత్విక్‌ను అభినందిస్తున్న చైర్మన్ సతీష్, ప్రిన్సిపాల్ రామారావు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా రెండో సంవత్సరం చదువుతున్న ద్రాక్షారపు సాత్విక్ ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాదులో జరిగిన ఫిడే రేటెడ్ బిలో 1600 స్లాస్ 1వ అంతర్జాతీయ చెస్ పోటీలలో 2వ రన్నరప్‌గా నిలిచాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను బీవీసీ విద్యాసంస్థల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీజీ రామారావు, డిప్లమా ప్రిన్సిపాల్ ఫణి శంకర్, కళాశాల ఏఓ కష్టారావు గురువారం అభినందించారు. సాత్విక్ అమలాపురంలో ఉన్న విక్టరీ అకాడమీలో కోచ్ సురేష్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

3, 10 తేదీల్లో ప్రాచీన కళాకేంద్రం పరీక్షలు

కాకినాడ కల్చరల్: ప్రాచీన కళాకేంద్రం (చండీఘర్ యూనివర్సిటీ) వార్షిక పరీక్షలు సెప్టెంబర్ 3, 10వ తేదీలలో టీటీడీ కల్యాణ మంటపం (సామర్లకోట)లో జరుగుతాయని సెంటర్ హెడ్ బేతా సత్యనారాయణ తెలిపారు. శాస్త్రీయ నృత్య, సంగీత (జూనియర్ విభాగం) సర్టిఫికెట్ కోర్సు, సీనియర్ డిప్లమా వార్షిక పరీక్షలు సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 10 నుంచి ఒంట గంట వరకు జరుగుతాయని తెలిపారు. ప్రాక్టికల్స్ సెప్టెంబర్ 10వ తేది ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

బంగారు ఆభరణాలు భద్రం

- బస్సులో బ్యాగ్ మరచిన ప్రయాణికుడు
- తిరిగి అప్పగించిన ఆర్టీసీ యంత్రాంగం


ప్రయాణికునికి బ్యాగ్ అందజేస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు, డీఎం మనోహర్ తదితరులు

కాకినాడ: బంగారు ఆభరణాలతో ఉన్న ఓ బ్యాగ్‌ను ప్రయాణికుడు ఆర్టీసీ బస్సులో మర్చిపోగా, వాటిని బస్సు డ్రైవర్, కండక్టర్ భద్రంగా అప్పగించిన ఘటన గురువారం కాకినాడలో జరిగింది. జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన ద్వారంపూడి వెంకటసత్యనారాయణరెడ్డి కాకినాడ వెళ్లేందుకు బలభద్రపురంలో ఆర్టీసీ బస్సును ఎక్కారు. కాకినాడలో దిగిన కొద్దిసేపటి తరువాత వెంటతెచ్చుకున్న బ్యాగ్‌ను బస్సులో మరచినట్టు గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం అందించారు. అయితే బస్సులో ఉన్న ఆ బ్యాగ్‌ను అప్పటికే గుర్తించిన డ్రైవర్ ఎం.దాసు, కండక్టర్ కె.వెంకటరమణ డిపో అధికారులకు అందజేశారు. బంగారు ఆభరణాలతో ఉన్న ఆ బ్యాగ్‌ను గురువారం ఉదయం డీపీటీవో శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, సెక్యూరిటీ ఎస్సై రంగారావు, ఇతర ఆర్టీసీ అధికారుల సమక్షంలో ప్రయాణికుడు చెప్పిన వివరాలను నిర్ధారించుకుని తిరిగి అప్పగించారు. ఆ బ్యాగ్‌లో రూ.4.30 లక్షలు విలువ చేసే బంగారు గొలుసు, చేతి కడియం, ఉంగరాలు, వాచ్, సెల్‌ఫోన్ ఉన్నాయని ఆర్టీసీ అధికారులు చెప్పారు. కండక్టర్, డ్రైవర్‌ల నిజాయితీని అధికారులు, ప్రయాణికులు అభినందించారు.

ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో అధికారికి మూడేళ్ల జైలు

సామర్లకోట/కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఆదాయ వనరులకు మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు నిరూపణ కావడంతో నిందితుడైన అధికారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం రాజమహేంద్రవరం ఏసీబీ కేసుల న్యాయమూర్తి యు.వి.ప్రసాద్ తీర్పు చెప్పారని ఏసీబీ ఇన్‌స్పెక్టరు పుల్లారావు తెలిపారు. గతంలో నిందితుడైన హౌసింగ్ ఏఈ చీమకుర్తి వెంకటరావును దోషిగా నిర్ధారణ చేసి ముద్దాయికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించినట్లు తెలిపారు. ముద్దాయికి సంబంధించిన రూ.12,36,387-84 పైసల సొమ్మును జప్తు చేయాలని ఆదేశించారన్నారు. ఈ కేసును ఏసీబీ తరఫున కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శేషయ్య వాదించారు.

టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో శనివారం ఎంఎస్‌సీ టైర్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీలో టెక్నీషియన్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ ఉద్యోగానికి డిప్లమా ఆల్ ట్రేడ్స్ (సివిల్ తప్ప) ఉత్తీర్ణులైన 24 సంవత్సరాల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ. 14,610 జీతం, భోజనం, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారు నెల్లూరి శ్రీసిటీలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని పీడీ లచ్చారావు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలమూరు: 216వ నంబరు జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ సెంటర్ వద్ద జరిగిన ప్రమాదంలో శెట్టి వెంకట పవన్‌కుమార్ (18) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన పవన్‌కుమార్ బుధవారం రాత్రి తన స్నేహితునితో కలిసి రావులపాలెం వెళ్లి తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. స్థానిక జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఫ్లైఓవర్ పనుల వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ఉన్న పవన్‌కుమార్‌ను అదే మార్గంలో వెళుతున్న ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితునికి స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై ఎల్.శ్రీనివాసనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: విద్యార్థులను ఆటోలో కళాశాలకు తీసుకువెళ్తున్న డ్రైవర్ ఒక్కసారిగా అపస్మారక స్థితికి వెళ్లాడు. తాను స్పృహ తప్పుతున్న విషయాన్ని గ్రహించిన డ్రైవర్ ఆటోను రోడ్డుపక్కన నిలిపివేయడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన పాశర్లపూడి పంచాయతీకి సమీపంలో మార్కెట్ వద్ద గురువారం జరిగింది. డ్రైవర్ బొక్కా శ్రీనివాసరావు తన ఆటోలో అప్పనపల్లి నుంచి ఎనిమిది మంది విద్యార్థులను అమలాపురంలోని కళాశాలలకు తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో పాశర్లపూడి చేరుకునే సరికి అతడు అస్వస్థతకు గురయ్యాడు. విషయాన్ని ముందుగానే గ్రహించిన శ్రీనివాసరావు ఆటోను రోడ్డు పక్కన నిలిపి, హ్యాండిల్‌పై కుప్పకూలిపోయాడు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందారు. దీనిని గమనించిన స్థానికులు ఆటో డ్రైవర్ శ్రీనివాసరావును వెంటనే రాజోలు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఆటోలో ఉన్న విద్యార్థులను మరొక ఆటోలో కళాశాలలకు పంపించారు.

కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

బిక్కవోలు: తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఊలపల్లి గ్రామానికి చెందిన పెంటపాటి తరుణ్ జి.మామిడాడకు చెందిన ఒక ఫైనాన్స్ కంపెనీలో రెండు నెలల నుంచి పనిచేస్తున్నాడు. ఈ నెల 25 తేదీన తన తండ్రి పెంటపాటి సత్యనాథమ్ తన కుమారుడిని కడప వెళ్లడానికి బిక్కవోలులో బస్సు ఎక్కించారు. రాత్రి 9 గంటలకు ఏలూరు చేరుకున్నానని తండ్రికి ఫోన్ చేశాడు. ఆ తరువాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. రూ.4.32 లక్షలు తీసుకువెళ్లినట్లు ఫైనాన్స్ వ్యాపారులు తనను అడుగుతున్నారని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో సోదరుడిపై దాడి

పెద్దాపురం: మద్యం మత్తులో సొంత తమ్ముడిపై కర్రతో అన్న దాడి చేసిన సంఘటన గురువారం జి.రాగంపేటలో జరిగిందని ఎస్సై వెలుగుల సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల్లోకి వెళితే... దేవర దుర్గ, అప్పన్న అన్నదమ్ములు. జి.రాగంపేటలో నివసిస్తున్నారు. గురువారం అన్న దుర్గ మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తమ్ముడితో ఘర్షణకు దిగాడు. మాటమాటా పెరిగి పక్కనే ఉన్న కర్రతో తన సోదరుడు అప్పన్నని కర్రతో బలంగా కొట్టాడు. తమ్ముడు అప్పన్న తలకు తీవ్ర గాయమైంది. స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఈ విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.